సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 18 । ఆగస్టు । 2024

మది నిండుగా.. గ్రాడ్యుయేషన్ పండగ



కేరింతలు కొడుతున్న ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విద్యార్థులు



విదేశీ విద్యార్థుల సందడి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ కిశోర్‌బాబు

- సందడి చేసిన విదేశీ విద్యార్థులు

విశాఖ సిటీ: ఆప్యాయంగా విద్యార్థుల పలకరింపులు.. ఆలింగనాలు.. కేరింతలు.. ఉపాధ్యాయుల అభినందనల మధ్య ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్) బీబీఏ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం జరిగిన వేడుకలను ముందుగా రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏయూ సిబ్ సంచాలకుడు ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ అభ్యసనం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని చెప్పారు. వేడుకల్లో భాగంగా విదేశీ విద్యార్థులు సందడి చేశారు. స్నేహితులకు అభినందనలు తెలుపుతూ వారితో కలిసి కేరింతలు కొట్టారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని అమూల్యమైన క్షణాలను పదిలపరచుకున్నారు. మహంకాళి ఉద్యోగ్ లిమిటెడ్ ఇండియా జోనా ఆన్‌లైన్ కామర్స్ సంస్థల నిర్వాహకులు హర్ష్ పగారియా, భావన పగారియా, ఏయూ సిబ్ ఆచార్యులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడుతున్న జూనియర్ వైద్యులు

అకృత్యంపై ఆగ్రహం

- రక్షణ చట్టం తెచ్చే వరకు ఆందోళన
- జూనియర్ వైద్యుల భారీ నిరసన ప్రదర్శన

సీతమ్మధార: విధి నిర్వహణలో ఉండే వైద్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించాలని జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మెడికోపై జరిగిన ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై జరిగిన క్రూరత్వ సంఘటనలు మొత్తం వైద్య వృత్తిని కదిలించాయన్నారు. కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్ మీద జరిగిన దాడి.. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న బెదిరింపులకు ఒక ఉదాహరణ అన్నారు. ఇటువంటి హింస.. వైద్యుల ప్రాణాలకు ముప్పు కలిగించడంతో పాటు ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందడంలో అంతరాయం కలిగిస్తుందని విచారం వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యుల కోసం జాతీయస్థాయిలో రక్షణ చట్టం తెచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళనలో సంఘ ప్రధానకార్యదర్శి ఎస్.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ప్రియా కృష్ణవేణి, వైద్యులు ఊహా రాపేటి, వై.రాజ్ వివేక్, కె.ఖజానా, సి.నాగ కిరణ్ కుమార్, ఎం.శిరీష, ఎస్కే మొయినుద్దీన్, ఎం.డి.రహీమా నస్రీన్, మనోజ్‌కుమార్‌రెడ్డి, రాకేష్ మిరియాల తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కోల్‌కతాలో జరిగిన ఘటనను నిరసిస్తూ వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి.. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



రక్షణ కల్పించాలని నినదిస్తున్న వైద్య విద్యార్థులు



నినాదాలు చేస్తున్న జూనియర్ వైద్యులు



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైద్యులు

హోంమంత్రి సంఘీభావం

జూనియర్ వైద్యులు నిర్వహిస్తున్న ఆందోళనకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సంఘీభావం ప్రకటించారు. గాంధీ విగ్రహం వద్ద వైద్యులు నిర్వహించిన నిరసనలో ఆమె పాల్గొన్నారు. కోల్‌కతాలో జరిగిన ఘటన పట్ల ఆమె తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

ఈఎన్‌సీలో స్టాఫ్ అర్ధ వార్షిక సమావేశం



మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: తూర్పు నావికా దళ కమాండ్ శక్తి, సామర్థ్యాలను మరింత పెంచే దిశగా శనివారం స్టాఫ్ అర్ధ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షత వహించగా.. కమాండ్‌లోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కమాండ్ పురోగతిని విస్తృతంగా సమీక్షించడంతో పాటు కమాండ్ సామర్థ్యాలను పెంచే మార్గాలపై చర్చించారు. వాటిని అమలు చేయడంపై దృష్టి సారించినట్లు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



జస్టిస్ జ్యోతిర్మయికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

నేడు నీతి ఆయోగ్ సభ్యుడి రాక

మహారాణిపేట: నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సరస్వత్ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 6 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. 19న రుషికొండలో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు తిరిగి ఢిల్లీ వెళతారు.

20న బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం

తాటిచెట్లపాలెం: ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

సోమవారం యథావిధిగా వినతుల స్వీకరణ

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్) ద్వారా యథావిధిగా వినతుల స్వీకరణ కొనసాగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండి.. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

భూటకం బట్టబయలు

- విశాఖలో కేవలం 138 ఎకరాలే ఫ్రీహోల్డ్ కింద రిజిస్ట్రేషన్
- 20 ఏళ్లు దాటిన డీ–పట్టా భూముల కొనుగోలుకు చట్టం ఉంది
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా స్పష్టీకరణ
- హయగ్రీవ, దసపల్లా, రామానాయుడు స్టూడియో వద్ద స్థలాల పరిశీలన
- ఇన్నాళ్లూ డీపట్టా భూములపై కూటమి నేతల గగ్గోలు
- నిజాలు వెలుగులోకి వచ్చేసరికి మూగబోయిన నోళ్లు



మహారాణిపేట : కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నారన్నది నానుడి. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఎలుకే లేకుండా కొండను తవ్వడం విచిత్రం. ఎన్నికలకు ముందు విశాఖలో జరిగిన భూ అక్రమాల లెక్కలు తేలుస్తామని చెప్పి.. ఇప్పుడు అసలు వాస్తవాలు తెలుసుకొని ఏం చేయాలో తెలియక గోళ్లు గిల్లుకుంటోంది. విశాఖలో డీ పట్టా భూముల వ్యవహారంలో కూటమి నేతల చెప్పినట్లుగా అక్రమాలను వెలికితీసేందుకు ఆగమేఘాల మీద రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.శ్రీరాం సిసోడియా నగరానికి వచ్చారు. రికార్డులు తనిఖీ చేసి కూటమి ప్రభుత్వ ఆశలపై నీళ్లు చల్లారు. జిల్లాలో వేల ఎకరాల డీపట్టా భూములు క్రమబద్ధీకరించుకున్నారని కూటమి నేతలు గగ్గోలు పెడితే.. అబ్బే.. అదేం లేదు.. కేవలం 138 ఎకరాలే ఫ్రీహోల్డ్ కింద రిజిస్ట్రేషన్లు అయ్యాయని సిసోడియా స్పష్టం చేయడంతో కూటమి ప్రజాప్రతినిధుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ పెద్దల భూ ఆక్రమణలు బయటపెడతామని ప్రగల్భాలు పలికిన నోర్లు మూగబోయాయి.

అడ్డూ అదుపూ లేకుండా ఆరోపణలు

విశాఖలో వేల ఎకరాల డీ పట్టాల భూములు అన్యాక్రాంతమయ్యాయని కూటమి నేతలు ఎన్నికలకు ముందు గగ్గోలు పెట్టారు. పేదల భూములను గత ప్రభుత్వ పెద్దలు కాజేశారని గొంతులు చించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ కింద డీ పట్టా భూముల రిజిస్ట్రేషన్లు చేసేశారంటూ ఊదరగొట్టారు. అడ్డూ అదుపూ లేకుండా ఎన్నికల్లో గెలవడానికి వైఎస్సార్ సీపీపై ఆరోపణలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పెద్దల బండారం బయటపెడతామని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు అధికారం చేపట్టిన వెంటనే డీ పట్టా లెక్కలు తేల్చాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను పురమాయించారు.

భూముల పరిశీలన

కూటమి ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా విశాఖలో అడుగుపెట్టారు. వచ్చి రాగానే టీడీపీ మౌత్ పీస్ పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కూటమి మంత్రికి మించిన స్థాయిలో.. భూముల కబ్జాలు జరిగిపోయాయని, పేదలను భయపెట్టి భూములు లాగేసుకున్న సందర్భాలు చూశామని, ఇలా.. అనేక విషయాలపై ప్రభుత్వ పెద్దల సూక్తి ముక్తావళిని వినిపించారు. ఇదిలా ఉంటే.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన డీ పట్టా భూముల రిజిస్ట్రేషన్లు, టీడీపీ నేతల ఆరోపించిన భూములను పరిశీలించారు. ముందుగా దసపల్లా భూములను సందర్శించారు. అవి కోర్టు పరిధిలో ఉన్నాయని తేల్చేశారు. అక్కడి నుంచి హయగ్రీవ భూములు పరిశీలించి అదే విషయాన్ని చెప్పారు. అలాగే రామానాయుడు స్టూడియో ప్రాంతంలో అవుట్, భీమిలిలో ఎర్రమట్టి దిబ్బల వద్ద చదును చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. భీమిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు.

కూటమి ఆశలపై నీళ్లు

గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిసోడియాతో చెప్పించడానికి పచ్చ మీడియా తెగ తాపత్రయ పడి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించినప్పటికీ.. అది జరగలేదు. విశాఖలో కేవలం 138 ఎకరాల డీ పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్లు చేసినట్లు తేల్చి చెప్పారు. 2 వేల ఎకరాల భూములను బెదిరించి రాయించుకున్నారనే ప్రచారంపై ఆయన స్పందిస్తూ.. 20 ఏళ్లు దాటిన డీ పట్టా భూములను కొనుగోలు చేసేందుకు చట్టం ఉందని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం ఎవరైనా భూములు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. అలాగే ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి హస్తం ఉందని చెప్పలేమని తేల్చేశారు. సిసోడియా పర్యటనలో భూ అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఎంతో ఆసక్తి చూపించిన కూటమి నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

చివరి ప్రయత్నం ఫ్లాప్

సిసోడియా పర్యటన, తనిఖీల్లో ఎటువంటి అక్రమాలు బయటపడకపోవడంతో వినతుల ద్వారా అయినా వైఎస్సార్ సీపీని ఇరుకున పెట్టవచ్చని కూటమి ప్రజాప్రతినిధులు భావించినప్పటికీ అది కూడా అట్టర్‌ఫ్లాప్ అయింది. భూ సమస్యలు, వివాదాలపై ప్రజల నుంచి వినతుల స్వీకరణను సిసోడియా కలెక్టరేట్‌లో చేపట్టారు.. ఇందులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై ఫిర్యాదులు వస్తాయని భావించారు. అయితే వ్యక్తిగత ఆస్తుల ఫిర్యాదులకు సంబంధించిన వినతులు మాత్రమే రావడంతో కూటమి నేతలు డీలా పడిపోయారు.

భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక మ్యాప్
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా వెల్లడి



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

మహారాణిపేట: ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వర్గీకరణతో కూడిన ప్రత్యేక మ్యాప్ తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కాలువలు ఉండే ప్రాంతాల్లో ఒకటికి రెండు సార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఆయన తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ రెవెన్యూ విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఏ, డి.నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీహోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పీఎంల రూపకల్పన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల డిజిటైలేజేషన్ ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుకునే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉండే భూములను వర్గీకరిస్తూ రెవెన్యూ, జీవీఎంసీ రెవెన్యూ విభాగం కలిసి మ్యాప్ రూపొందించాలని, ఒక్కో రకం భూమికి ఒక్కో రకం రంగు చూపించే మ్యాప్ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వాటిని జీపీఎస్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలన్నారు. రికార్డుల తయారీలో రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ విభాగం, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయం వహించాలని, అందరి వద్దా ఒకే లాంటి రికార్డు ఉండేలా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఆధునిక సాంకేతికతతో 3డీ మ్యాపింగ్ రూపొందించాలని, వీలుంటే ఏఈ టెక్నాలజీ సహాయం తీసుకోవాలని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు వసతులు కల్పించాలన్నారు.

రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి

22ఏలో చేస్తున్న ప్రక్రియలకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అర్బన్ ల్యాండ్ విభాగం రూపొందిస్తున్న రికార్డుల వివరాల్లో తారతమ్యం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని తేల్చి చెప్పారు. దేవాదాయ భూముల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. కాలువలు, చెరువులు, నీటి బావుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని కట్టడాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, సీతారాం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సింహచలం: విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగులకు, వైదికులకు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఉదయం స్వామికి జరిగే సుప్రభాత సేవలోను, తీర్థబిందె పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన వారు వచ్చారో లేదో పరిశీలన జరిపారు. ఒక డోలు విధ్వాంసుడు గైర్హాజరు కావడాన్ని గమనించారు. ఉదయం త్రిపురాంతకస్వామి ఆలయం తెరవకపోవడాన్ని గమనించారు. దీంతో ఇరువురికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఏఈవో ఆనంద్‌కుమార్‌ని ఆదేశించారు. కాగా చందనోత్సవం తర్వాత నిలిచిపోయిన తీర్థబిందె సంప్రదాయాన్ని శనివారం నుంచి పునరుద్ధరించారు. ఏటా చందనోత్సవం తర్వాత మూడునెలలపాటు తీర్థబిందెని తీసుకొచ్చే సంప్రదాయాన్ని నిలిపివేసి ఆ తర్వాత పునరుద్ధరిస్తారు.

ఇకపై ఎఫ్ఐఆర్ పొందడం సులభం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



వివరాలు వెల్లడిస్తున్న నగర సీపీ శంఖబత్ర బాగ్చి

అల్లిపురం: ఎఫ్ఐఆర్ కాపీ కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగనవసరం లేదు. ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే సులభంగా ఎఫ్ఐఆర్ కాపీని పొందవచ్చని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. https://citizen.appolice.gov.in లోకి వెళ్లి, 'వ్యూ ఎఫ్ఐఆర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత 'రిజిస్టర్' బటన్‌పై క్లిక్ చేసి, సిటిజెన్ రిజిస్ట్రేషన్ ఫారంను పూర్తి చేసి సబ్మిట్ చేయాలి. తర్వాత మీకు వచ్చిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. 'సిటిజెన్ సర్వీసెస్'అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి.. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను(పోలీస్‌స్టేషన్ పేరు, ఎఫ్ఐఆర్ నంబర్ మొదలైనవి) నమోదు చేయాలి. అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సీపీ వివరించారు. ఈ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని కమిషనర్ తెలిపారు.

ఆర్థిక నేరాలపై బడ్స్ చట్టం కింద కేసుల నమోదు

స్కీములు, చిట్టీల పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ఎగ్గొట్టిన వారిపై కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన బర్నింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్స్ స్కీమ్ యాక్ట్–2019(బడ్స్) కింద కేసులు నమోదు చేస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ చట్టం కింద రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలో కేసులు నమోదయ్యాయన్నారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో 40 మందిపై, గాజువాకలో వంద మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులపై ఆరోపణలు నిరూపణ అయితే పదేళ్ల జైలు శిక్ష, వారు వసూలు చేసిన మొత్తానికి రెండింతలు జరిమానా వేసే అవకాశం ఉందన్నారు. ఈ అంశంలో కోర్టు వరకు కాకుండా.. పోలీసులే చర్యలు తీసుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాసినట్లు సీపీ తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీతో ఇబ్బందులు

- బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో ఇసుక సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చైర్మన్ సీహెచ్ నవనీత్, గౌరవ కార్యదర్శి ఎంఎస్ మూర్తి కోరారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఉచిత ఇసుక పాలసీ కారణంగా అనేక రకాలుగా ఇబ్బందులు పడతున్నామన్నారు. ప్రస్తుత పాలసీ ప్రకారం ఆధార్ కార్డు ఆధారంగా రోజుకు 10 టన్నుల ఇసుక మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఎంఈఎస్, డీజీఎన్‌పీ, వీపీఏ, హెచ్‌పీసీఎల్, ఎన్ఎస్‌టీఎల్, ఐవోసీ, ఆర్‌అండ్‌బీ, జీవీఎంసీ, సీపీడబ్ల్యూడీ, వీఎంఆర్డీఏ తదితర శాఖల్లో ప్రభుత్వ పనులు చేస్తున్నామని, తమకు బల్క్‌గా ఇసుక ఇప్పించగలిగితే సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీ కారణంగా ఇసుక అందడం లేదని.. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా మైన్స్ అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. పాత పద్ధతి ప్రకారంగా కాంట్రాక్టర్లకు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి.. ఎక్కువ మొత్తంలో ఇసుక ఇప్పించాలని కోరారు.

కేబుల్ మూర్తి భూబాగోతం

- 600 చదరపు గజాల ఉక్కు స్థలంలో అక్రమంగా షెడ్ల నిర్మాణం
- కార్పొరేటర్ ఆక్రమణలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు
- స్పందించిన రెవెన్యూ అధికారులు
- అక్రమ నిర్మాణాల తొలగింపు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ 65వ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు



కార్పొరేటర్ అనుచరులు నిర్మించిన రేకుల షెడ్డును తొలగిస్తున్న భూసేకరణ అధికారులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు(కేబుల్ మూర్తి) భూకబ్జాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వార్డు పరిధిలోని సర్వే నంబర్ 86లో స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకున్న అతని కన్ను ఇప్పుడు స్టీల్ ప్లాంట్ (దళితులకు కేటాయించినట్టు చెబుతున్న) భూమిపై పడింది. తన అనుంగ అనుచరుడు, జీవీఎంసీ కాంట్రాక్టర్‌తో కలసి సుమారు 600 చదరపు గజాల స్థలంలో రాత్రికి రాత్రే రేకుల షెడ్లు నిర్మించారు. దీంతో దళితులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమించిన స్థలం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. అలాగే టీడీపీ 65వ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు ఈ వ్యవహారంపై పెదగంట్యాడ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన షెడ్లు తొలగించారు.

ఏం జరిగిందంటే..

జీవీఎంసీ 65వ వార్డు కేఎల్‌రావు నగర్ పక్కన, టిడ్కో హౌసింగ్‌కు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 64/1డీ లో గతంలో 5 ఎకరాల స్థలంలో దళితులు ఉండేవారు. స్టీల్‌ప్లాంట్‌కు భూసేకరణ సమయంలో ఆ స్థలాన్ని అధికారులు సేకరించారు. ఆ తర్వాత స్టీల్‌ప్లాంట్ అధికారులు ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచేశారు. 2018లో అప్పటి ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మించేందుకు ఆ స్థలాన్ని సేకరించింది. ఆ సమయంలో దళితులకు ఎకరా భూమి కేటాయించారు. అయితే ఆ స్థలం ఖాళీగా ఉండడంతో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కన్ను దానిపై పడింది. బీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న కోట్లాది రూపాయల విలువైన ఆ స్థలాన్ని ఎలాగైనా తన కబంధ హస్తాల్లో ఉంచుకోవాలని స్కెచ్ వేశారు. వెంటనే తన అనుంగు శిష్యుడైన జీవీఎంసీ కాంట్రాక్టర్ నాయుడుతో అక్కడ రాత్రికి రాత్రే షెడ్లు వేయించేశాడు. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్ నాయుడు నుంచి సుమారు రూ.50 లక్షలు కార్పొరేటర్ తీసుకున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.గతంలో జరిగిన ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయా షెడ్లను తొలగించారు.

మా భూమిపై పడ్డారు

ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రభుత్వ భూములను కబ్జా చేయడంతో పాటు ఇప్పుడు దళితుల భూమిపై పడ్డారని ధ్వజమెత్తారు. కలెక్టర్ స్పందించి కార్పొరేటర్ భూకబ్జాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్ఐకు ఫిర్యాదు చేసినా..

భూకబ్జా వ్యవహారంపై స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సచివాలయ సిబ్బంది వెంటనే స్టీల్‌ప్లాంట్ ఆర్ఐ మంగరాజు దృష్టికి తీసుకెళ్లారు. అయితే మంగరాజు కాలయాపన చేశారని చెబుతున్నారు. శనివారం ఒక్కసారిగా వాతావరణం వేడెక్కడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చారని దళితులు ఆరోపిస్తున్నారు. షెడ్లు నిర్మించిన స్థలం స్టీల్‌ప్లాంట్‌కు చెందినది అని నిర్ధారించి రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలు తొలగించారు.

వదల బొమ్మాళీ.. వదలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ కార్పొరేటర్ నర్సింహపాత్రుడు జూలు విదిల్చాడు. సుమారు 600 చదరపు గజాల స్థలంలో రాత్రికి రాత్రి షెడ్లు వేయించేశాడు. దీంతో ఒక పక్క దళితులు మరో పక్క టీడీపీ నాయకులు భగ్గుమన్నారు. శనివారం ఉదయం వారంతా పెద్ద ఎత్తున కబ్జాకు గురైన స్థలం వద్దకు చేరుకున్నారు. పెదగంట్యాడ తహసీల్దార్‌కు టీడీపీ 65వ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. దళితులంతా కలసి పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తమ భూములు రక్షించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో పెదగంట్యాడ మండల తహసీల్దార్ లోకవరపు రామారావు స్పందించారు. ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించారు.

ఒంటరిగా వెళ్లే వారే టార్గెట్

- ఈ నెల 15వ తేదీ రాత్రి ఐదు చోట్ల దోపిడీలు
- ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన క్రైం డీసీపీ వెంకటరత్నం



వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

ఎంవీపీకాలనీ: వారంతా యువకులు. వ్యసనాలకు బానిసయ్యారు. డబ్బుల కోసం ఒంటరిగా వెళ్లే వారిని టార్గెట్ చేశారు. గుంపుగా వెళ్లి దాడులు చేసి సెల్‌ఫోన్లు, నగదు దోచుకున్నారు. ఒకే రోజు వరుస నేరాలకు పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. రంగంలోకి దిగిన పోలీసులు ఈ గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం క్రైం డీసీపీ వెంకటరత్నం ఈ వివరాలు వెల్లడించారు. ఐదుగురు యువకులు గ్యాంగ్‌గా ఏర్పడి అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు ఒంటరిగా వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతూ సొత్తు దోచుకునేవారు. దేవర వంశీ, బొద్దు ధనరాజ్, వాసుపల్లి నరేష్, సూరాడ చిట్టిబాబు, యరుపల్లి బెంజిమెన్ వన్‌టౌన్‌లో పలు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరంతా గంజాయి, మద్యం సేవించి ఈ నెల 15వ తేదీన రాత్రి ఐదు చోట్ల దోపిడీలకు పాల్పడ్డారు. ఆ రోజు రాత్రి 11.30 నుంచి 12 గంటల మధ్య హెచ్‌బీ కాలనీలో ఓ వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోన్‌తో పాటు నగదు దోచుకున్నారు. అలాగే ఒంటిగంట ప్రాంతంలో పెదవాల్తేర్ కూడలిలో, 1.30 గంటలకు ఇసుకతోట కూడలిలో, 2.10కి జీవీఎంసీ మెయిన్ ఆఫీస్ దరి రామ్‌నగర్‌లో, 16వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో కైలాసగిరి రోప్ వే వద్ద ఒంటరిగా వెళ్లేవారిని టార్గెట్ చేసుకుని సెల్‌ఫోన్లు, నగదు దోచుకున్నారు. ఈక్రమంలో ఒకరిపై తీవ్రంగా దాడి చేశారు. ఎంవీపీ కాలనీ, 3 టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ సంఘటనలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. దీంతో నేరవిభాగం పోలీసులు అప్రమత్తమై సంఘటనలు జరిగిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇందులో పాత నేరస్తుడు దేవర వంశీని గుర్తించారు. దీంతో మొత్తం గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని డీసీపీ వెంకటరత్నం తెలిపారు. నిందితులను నుంచి రూ.2,200తోపాటు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంటల వ్యవధిలో కేసును ఛేదించిన ద్వారకా ఏసీపీ వెంకటరావు, క్రైం సీఐ శ్రీనివాసరావులను డీసీపీ వెంకటరత్నం అభినందించారు. మీడియా సమావేశంలో ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- 18 తులాల బంగారు వస్తువులు, 20 తులాల వెండి స్వాధీనం
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు
- గత ఏడాది ఆర్‌హెచ్ కాలనీలో దొంగతనం



రికవరీ చేసిన బంగారు, వెండి వస్తువులు

మధురవాడ: గత ఏడాది జరిగిన చోరీ కేసును ఛేదించినట్టు క్రైం డీసీపీ పి. వెంకటరత్నం తెలిపారు. ముగ్గురు నిందితుల్లో ఒకర్ని అరెస్టు చేశామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పీఎంపాలెం క్రైం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆర్‌హెచ్ కాలనీలో నివాసముంటున్న కరకవలస ధనుంజయరావు ఇంట్లో అక్టోబర్ 5న చోరీ జరగ్గా.. 6న బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో ఓ వ్యక్తిని పోలీసులుఅనుమానించి అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయి విచారణలో ఆ వ్యక్తి చోరీ చేయలేదని నిర్ధారణకు వచ్చారు. దీంతో వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి.. పీఎంపాలెం బాబా కళాశాల సమీపంలో ఉంటున్న ముగ్గురు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఈ కేసులో ఏ2 జేఎన్ఎన్‌యూఆర్ఎం బక్కన్నపాలెం-2 కాలనీ 14వ బ్లాక్, ఎఫ్-8లో నివాసం ఉంటున్న కోరాడ కరుణకుమార్(19)ను బాబా కళాశాల జంక్షన్ వద్ద శనివారం అరెస్టు చేశారు. హారం, 3 తులాలనెక్లెస్, 3 తులాల 4 గాజులు, చెవి దుద్దులు, తులం చైన్, 18 తులాల 13 బంగారు ఆభరణాలు, 20 తులాల 2 వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ క్రైం తెలిపారు. ఏ1 ఆనంద్, ఏ3 చరణ్‌లు పరారీ ఉన్నారని వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందం గాలిస్తోందని వెల్లడించారు. ఇదిలా వుండగా ఎండాడ రోడ్డులో పనోరమ హిల్స్‌లో ఇటీవల జరిగిన భారీ చోరీ (1040 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 లక్షలు)కి సంబంధించి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. అయితే చోరీకి పాల్పడింది చెడ్డీ గ్యాంగా? మరో గ్యాంగా? అనే కోణంలో విచారణ జరుపుతున్నామని డీసీపీ వెంకటరత్నం పేర్కొన్నారు. మీడియా సమావేశంలో విశాఖ నార్త్ సబ్ డివిజన్ క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నరవ క్వారీ తవ్వకాల స్థలం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



నరవలో తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పెందుర్తి: పెందుర్తి మండల రెవెన్యూ పరిధిలోని గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్న భూ భాగాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన ఫా'రెస్ట్' ఆఫీసర్లు కథనానికి స్పందించారు. జిల్లా అటవీశాఖ అధికారి శ్రీరామ్ నరేష్ బెర్లాంగ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ గాజువాక సెక్షన్ అధికారి శేఖర్ నరవలోని క్వారీ తవ్వకాల ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. రికార్డుల ప్రకారం అటవీశాఖ భూ భాగం పరిధిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో శ్రీరామ్ నరేష్ మాట్లాడుతూ నరవ ప్రాంతంలో అటవీశాఖ భూముల్లో ప్రస్తుతం ఎలాంటి తవ్వకాలు జరగలేదన్నారు. రానున్న రోజుల్లో మరింత లోతుగా విచారణ చేసి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాం..

- భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన సిసోడియా
- టీడీపీ హయాంలో సిట్ నివేదిక బయట పెట్టాలని జనసేన కార్పొరేటర్ ఫిర్యాదు



వినతులు స్వీకరిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట: భూ సమస్యలపై వచ్చిన ప్రతి ఫిర్యాదుని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వివిధ భూ సమస్యలపై 97 వినతులను స్వీకరించారు. అదేవిధంగా.. శుక్రవారం సాయంత్రం పోర్టు గెస్ట్ హౌస్‌లో 9 ఫిర్యాదులు స్వీకరించారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన సిట్ వివరాలు బహిర్గతం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. భీమిలి, పరదేశిపాలెంలో అన్యాక్రాంతమైన భూదాన్ భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ కార్యదర్శి పైడిరాజు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత, పెండింగ్‌లో ఉన్న సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, రెవెన్యూ అధికారుల తప్పిదాలపైన ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి.

- భీమిలి మండలం నేరెళ్లవలస గ్రామంలో సర్వే నెంబర్ 27లో వ్యవసాయ భూమిని ఇద్దరు రెవెన్యూ అధికారులు రికార్డులు మార్పు చేసి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని గృహజ్యోతి బిల్డర్స్ ఎస్టేట్‌కు చెందిన పలువురు ప్లాట్స్ ఓనర్సు ఫిర్యాదు చేశారు.
- గోపాలపట్నం కప్పరాడ రెవెన్యూ విలేజ్‌లో సర్వే నెంబర్ 12లో స్థలాన్ని కొంత మంది ఆక్రమించారని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆర్‌టీఐ కార్యకర్త గుండు అప్పలరాజు ఫిర్యాదు చేశారు.
- 12 ఏళ్ల క్రితం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి లే అవుట్ వేసుకున్నామని.. ఆ స్థలం తమదని ఎండోమెంటు అధికారులు బోర్డు పెట్టారని.. తమకు న్యాయం చేయాలని పలువురు విశ్రాంతి ఉద్యోగులు కోరారు.
- గాజువాక తుంగ్లాంలో 4.58 ఎకరాల స్థలం తాత, ముత్తాల నుంచి తమ ఆధీనంలో ఉందని, కొంత మంది ఈ స్థలం కాజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని జి.సింహాచలం, చిన్నారావు ఫిర్యాదు చేశారు.
- తమ ఇంట్లో ఎంతో కాలంగా ఉంటున్న వ్యక్తి తమను మోసగించి.. ఇప్పుడు ఇంటిని నుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని గాజువాకకు చెందిన అత్తిలి సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు.

సాక్షి ఫొటో జర్నలిస్టులకు అవార్డులు



పిఎల్ మోహనరావు



ఎం.డి.నవాజ్

విశాఖ సిటీ: జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సాక్షి విశాఖ ఎడిషన్ ఫొటో జర్నలిస్టులు పి.ఎల్.మోహనరావు, ఎం.డి.నవాజ్ సత్తా చాటారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించింది. ఇందులో జనరల్ కేటగిరీలో సింహాచలం గిరిప్రదక్షిణ వైభవ దృశ్యాన్ని కెమెరాలో బంధించిన ఎండీ నవాజ్, అలాగే విశాఖలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా బాణాసంచా వెలుగులను తన కెమెరాతో క్లిక్ మనిపించిన పి.ఎల్.మోహనరావు ఫొటోలు ఎంపికయ్యాయి. విజయవాడలో ఈ నెల 19న జరిగే వేడుకల్లో ఏపీపీజేఏ అచీవ్ అవార్డులను వీరు అందుకోనున్నారు.

కంచరపాలెం పాలిటెక్నిక్‌కు ప్రతిష్టాత్మక పథకం

- 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'కు ఎంపిక
- రేపటి నుంచి శిక్షణ తరగతులు

మురళీనగర్ : కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఏఐసీటీఈ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమం నిర్వహణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంపికైంది. రాష్ట్రంలోని 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి దరఖాస్తులు రాగా కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సమర్పించిన నివేదికను పరిగణలోకి తీసుకుని ఈ కళాశాలను ఎంపిక చేసింది. 2024-2025 విద్యా సంవత్సరానికి శిక్షణ తరగతులు ఇక్కడ నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

సోమవారం నుంచి 24వ తేదీ వరకు మొదటి విడత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనే అధ్యాపక సిబ్బందికి ఉత్పత్తుల్లో నాణ్యత నిర్వహణ, లాజిస్టిక్ ఆప్టిమైజేషన్ అమలుతో సహా నాణ్యత నిర్వహణ సూత్రాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యారంగ నిపుణులు, పరిశ్రమలకు చెందిన వివిధ విభాగాల నిపుణులు పాల్గొని వారం రోజులు మొదటి బ్యాచ్‌కు చెందిన 50 మంది ఫ్యాకల్టీలకు శిక్షణనిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, తులసీరామ్ ఇతర ఫ్యాకల్టీ సభ్యులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు

17 మంది పోలీసులకు పదోన్నతి



పదోన్నతి పొందిన ఏఎస్ఐను అభినందిస్తున్న సీపీ

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 17 మంది పోలీస్ సిబ్బంది పదోన్నతులు పొందారు. కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో అందుబాటులో ఉన్న 11 మందికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. వారికి ర్యాంకులతో పాటు ఓ మొక్కను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారంతా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఒరవడి కొనసాగిస్తామన్నారు. జేసీపీ డాక్టర్ కె.ఫకీరప్ప తదితరులు పాల్గొన్నారు.


కేజీహెచ్‌కు సమ్మె ఎఫెక్ట్



వెలవెలబోతున్న క్యాజువాల్టీ

మహారాణిపేట: జూనియర్ వైద్యులు సమ్మె ప్రభావం కేజీహెచ్ మీద తీవ్రంగా పడింది. నిత్యం రోగులతో రద్దీగా ఉండే కేజీహెచ్ క్యాజువాల్టీ శనివారం వెలవెలబోయింది. అత్యవసర రోగుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేపట్టారు. 25 మంది వైద్యులను ఓపీ వద్ద, వార్డుల్లో నియమించారు. అవసరమైన అందరికీ వైద్యసేవలు అందించినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. వైద్యుల సెలవులను రద్దు చేశామన్నారు.

కేంద్ర నోటరీగా మన్మథరావు



విశాఖ లీగల్: నగరానికి చెందిన న్యాయవాది పి.మన్మథరావు కేంద్ర ప్రభుత్వ నోటరీ సేవలను మరో ఐదేళ్లు పొడిగిస్తూ.. కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు దశాబ్దాలుగా న్యాయవాది వృత్తిలో ఉన్న మన్మథరావు పలు ప్రైవేట్ సంస్థలకు న్యాయ సలహాదారుడిగా సేవలందిస్తున్నారు. పేదలకు ఉచితంగా నోటరీ సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దంత నరేష్ కుమార్, బార్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, మహిళా న్యాయవాదులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పప్పు అనురాధ అభినందించారు.

ముగ్గుర్ని కాపాడిన లైఫ్‌గార్డ్స్



విద్యార్థులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోతుండగా లైఫ్ గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. నగరానికి చెందిన బి. దీపక్, ఎస్.నితిన్, ఎస్.కాషిక్ శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు బీచ్‌కొచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరు కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సూరాడ నూకరాజు, డి.కార్తీక్, ఎం. అమ్మోరు గమనించి.. వారిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. విద్యార్థులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.